సాక్షి
విజయనగరం
ఆదివారం ǀ 9 ǀ ఏప్రిల్ ǀ 2023



పీహెచ్‌సీల్లో వైద్య సేవలు భేష్

జిల్లాలోని పీహెచ్‌సీల్లో 24 గంటల పాటు వైద్యసేవలు అందుతున్నాయి. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పిస్తున్నాయి. ఆపదవేళ ఆదుకుంటున్నాయి. - 8లో



సీతంలో ముగిసిన 'హ్యాకథాన్' టెక్నో పోటీలు

గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగు రోజులుగా నిర్వహించిన 'హ్యాకథాన్-2023' శనివారం ముగిసింది. - 8లో



వాలీబాల్ టోర్నీ విజేత రాజమండ్రి

జామాలో పగడాలమ్మ ఆలయ జాతర సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ టోర్నీ విజేతగా రాజమండ్రి జట్టు నిలిచింది. పోటీలు రెండు రోజుల పాటు హోరాహోరీగా సాగాయి. - 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహార్
ఆది (సా॥)	సోమ (ఉ॥)
6:16	4:20

న్యూస్‌రీల్

ఏపీఎస్పీ 5వ బెటాలియన్ కమాండెంట్‌గా రాహుల్ దేవ్



డెంకాడ: చింతలవలస 5వ ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా రాహుల్‌దేవ్ శర్మను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ఇక్కడ కమాండెంట్‌గా పనిచేసిన విక్రాంత్ పాటిల్‌ను పార్వతీపురంమన్యం జిల్లా ఎస్పీగా బదిలీచేసింది.పార్వతీపురం మన్యం ఎస్పీగా పనిచేసిన విద్యాసాగర్ నాయుడు విశాఖపట్నం డీసీపీగా బదిలీ అయ్యారు.

12న కొత్త కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

- జిల్లాకు మూడో మహిళా కలెక్టర్



కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాకు కొత్తగా నియామకమైన కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఈ నెల 12 బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత కలెక్టర్ సూర్యకుమారి 11న రిలీవ్ అవుతారు. ముందురోజు నాగలక్ష్మి జిల్లాకు చేరుకుంటారు. మరుసటిరోజు ఉదయం కలెక్టరేట్‌కు చేరుకుని ప్రస్తుత కలెక్టర్ నుంచి బాధ్యతలు తీసుకుంటారని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. విజయనగరం జిల్లాకు ఆమె 27వ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకు పనిచేసిన కలెక్టర్లలో ఆమె మూడో మహిళా కలెక్టర్ కావడం గమనార్హం.

గడపగడపకూ సంక్షేమ పాలన

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



గొట్టుపల్లిలో జరిగిన సభలో మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ మజ్జిశ్రీనివాసరావు

మెరకముడిదాం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గడపగడపకు సంక్షేమ పాలన అందిస్తోందని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం ప్రజల సంక్షేమం కోసం పరితపిస్తూ చక్కనిపాలన సాగిస్తున్నారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గొట్టుపల్లి గ్రామంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు దేశంలో మరెక్కడా, ఏ ముఖ్యమంత్రి అమలు చేయలేదన్నారు. అర్హతే కొలమానంగా పథకాలు అమలుచేస్తున్నారని చెప్పారు. చంద్రబాబు మోసపూరిత, మభ్యపెట్టే మాటలను నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, ఎంపీపీ తాడ్డికృష్ణవేణి, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, పలాన నియోజకవర్గ పరిశీలకుడు కె.వి.సూర్యనారాయణరాజు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, బూర్లె నరేష్‌కుమార్, సర్పంచ్ సుంకరి రమేష్, ఎంపీడీఓ పి.రామకృష్ణ, తహసీల్దార్ బి.రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

30 మంది విద్యార్థులు గైర్హాజరు

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో శనివారం జరిగిన పదోతరగతి ఇంగ్లిష్ పరీక్షకు 30 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈఓ ఎస్‌డీవీ రమణ తెలిపారు. 64 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 10,508 మందికి 10,478 మంది విద్యార్థులు హాజరయ్యారు.

టీడీపీ మొసలికన్నీరు..!

- బోయ, వాల్మీకి కులాలను ఎస్టీల్లో చేర్చాలంటూ చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే తీర్మానం
- నాడు ప్రతిపక్షంలోనున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేల అభ్యంతరం
- మళ్లీ తీర్మానంపై తేనెతుట్టెను కదిపిన చంద్రబాబు, లోకేష్
- కొన్ని మార్పులతో అదే తీర్మానాన్ని కేంద్రానికి పంపిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- గిరిజనులకు నష్టం జరిగిపోతోందంటూ టీడీపీ నాయకుల పగటివేషాలు
- రాజకీయ లబ్ధి కోసం గిరిజనులను రెచ్చగొడుతున్న వైనం
- గిరిజనులకు నష్టం లేకుండా చర్యలకు జగనన్న ప్రభుత్వం సిద్ధమని రాజన్నదొర వెల్లడి

మొన్న

గత టీడీపీ ప్రభుత్వమే రాజకీయ లబ్ధి కోసం రాయలసీమ మైదాన ప్రాంతాల్లోనున్న బోయ, వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్లు అంటూ తేనెతుట్టెను కదిపింది. రాష్ట్రమంతా రిజర్వేషన్లు వర్తించేలా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ 2017 డిసెంబర్ 1న మంత్రివర్గం ఆమోదించింది. అసెంబ్లీ, శాసనమండలిలో చేసిన తీర్మానాలను అదేనెల 15వ తేదీన కేంద్రానికి పంపింది. దీనివల్ల ఏజెన్సీ ప్రాంతాల్లోనున్న గిరిజనుల హక్కులకు భంగం కలుగుతుందని నాడు ప్రతిపక్షంలోనున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేల అభ్యంతరంతో ఆ వ్యవహారం అక్కడితో ఆగింది.

నిన్న

బోయలను, వాల్మీకి కులస్తులను ఎస్టీ జాబితాలోకి చేర్చడానికి కేంద్రంపై ఒత్తిడి తేవాలంటూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో నారా లోకేష్ స్వయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి 2022 ఏప్రిల్ 5న లేఖ రాశారు. ఇటీవల రాయలసీమలో జరుగుతున్న తన పాదయాత్రలోనూ బోయ, వాల్మీకులను రెచ్చగొట్టారు. అంతకుమించి ఆయన తండ్రి చంద్రబాబు కూడా చిచ్చు రేపారు. రాష్ట్రానికి ఇదేమి కర్మ పేరుతో కర్నూలు జిల్లాలో నిర్వహించిన కార్యక్రమాల్లోనూ పదేపదే ప్రస్తావించారు.

నేడు

కేవలం రాయలసీమలో మాత్రమే బోయ, వాల్మీకులకు రిజర్వేషన్లు వర్తించేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. గతం విస్మరించిన టీడీపీ ఎప్పటిలాగే రెండు నాల్కల సిద్ధాంతాన్ని బయటకు తీసింది. విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని గిరిజనులకు అన్యాయం జరిగిపోతుందంటూ మొసలికన్నీరు కార్చుతోంది. గిరిజనుల పక్షపాతిగా పేరొందిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపైకి ఉసిగొల్పుతోంది. వారి వేలితో వారి కంటినే పొడుచుకునేలా ఉచ్చులోకి దించుతోంది.



బోయ, వాల్మీకి సామాజిక వర్గాలకు ఎస్టీ రిజర్వేషన్ల తీర్మానం అమలుకోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి టీడీపీ నేత నారా లోకేష్ పంపిన లేఖ ప్రతి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, విజయనగరం: అమాయకులైన గిరిజనుల్లో చిచ్చు పెట్టేందుకు టీడీపీ నాయకులు తమకు సహజసిద్ధంగా వచ్చిన రెండు నాల్కల సిద్ధాంతాన్ని వాడుతున్నారు. చంద్రబాబు, లోకేష్ రాయలసీమలో వెళ్లినప్పుడు అక్కడున్న బోయ, వాల్మీకి కులస్తులకు మద్దతుగా మాట్లాడుతున్నారు. ఇక్కడికి వచ్చేసరికి వారి ఒత్తిడితో ఎస్టీ రిజర్వేషన్లు కల్పిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన తీర్మానంపై మొసలికన్నీరు కార్చుతున్నారు. వాస్తవానికి బోయ, వాల్మీకి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ కేంద్రానికి తీర్మానం చేసింది గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనన్న విషయాన్ని ఉమ్మడి విజయనగరం జిల్లాలోని టీడీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగానే విస్మరిస్తున్నారు. గిరిజనులకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేల ఇళ్లపైకి ఉసిగొల్పుతున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా ఉన్న గిరిజనుల మధ్య చిచ్చుపెట్టి రాజకీయంగా ఉనికిని చాటుకోవడానికి టీడీపీ నాయకులు చేస్తున్న కుతంత్రాలపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నాడు నోరెత్తని టీడీపీ నేతలు...

బోయ, వాల్మీకి సామాజిక వర్గాలను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ 2017 డిసెంబర్ 15వ తేదీన నాటి చంద్రబాబు ప్రభుత్వం కేంద్రానికి తీర్మానం పంపించింది. దీనిపై కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ మరికొన్ని వివరాలు కోరింది. వాటిని జోడించి మళ్లీ 2018 సెప్టెంబర్ 5వ తేదీన మరోసారి తీర్మానాన్ని పంపినది కూడా అప్పటి టీడీపీ ప్రభుత్వమే. అంత జరుగుతున్నా నాడు ఎమ్మెల్సీగానున్న సాలూరు టీడీపీ నాయకురాలు గుమ్మడి సంధ్యారాణి కనీసం నోరెత్తలేదు. చంద్రబాబు ప్రలోభాలకు లొంగి వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి ఫిరాయించిన దివంగత అరకు ఎమ్మెల్యే సర్వేశ్వరరావు గానీ, నాటి పాడేరు, రంపచోడవరం ఎమ్మెల్యేలు గిడ్డి ఈశ్వరి, వంతల రాజేశ్వరిగానీ కనీసం నోరు మెదపలేదు. ఈ తీర్మానం వల్ల ఇక్కడి గిరిజనుల ప్రయోజనాలకు నష్టం కలుగుతుందని గొంతు వినిపించింది అప్పుడు ప్రతిపక్షంలోనున్న వైఎస్సార్‌సీపీ నేతలే. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని గిరిజనుల ప్రయోజనాలకు ఇబ్బంది రాకూడదని ఢిల్లీలో విశ్వప్రయత్నాలు చేసింది సాలూరు ఎమ్మెల్యే పీడిక రాజన్నదొర, పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి మాత్రమే. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం ఆ తీర్మానాన్ని పెండింగ్‌లో పెట్టింది. మళ్లీ ఇప్పుడు చంద్రబాబు, లోకేశ్ బోయ, వాల్మీకి కులస్థులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని తాము తీర్మానం చేస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏమీ చేయలేదంటూ సభల్లో ఉపన్యాసాలు మొదలెట్టారు. దీంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శాసనసభలో తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపిన సంగతి తెలిసిందే.

గిరిజనులకు అన్యాయం జరగనివ్వను

సాలూరు: నేను నిజమైన గిరిజనుడుని.. వారి సమస్యలు నాకు తెలుసు.. వాటి పరిష్కారానికి కట్టుబడి ఉన్నాను.. గిరిజనులకు అన్యాయం జరగనివ్వనని డిప్యూటీసీఎం, గిరిజనసంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర స్పష్టంచేశారు. బోయ, వాల్మీకి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చుతూ అసెంబ్లీలో చేసిన తీర్మానానికి వ్యతిరేకంగా ఏపీ గిరిజన సంఘం, ఆదివాసీ సంఘాల జేఏసీ సభ్యులు సాలూరు పట్టణంలో శనివారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం డిప్యూటీ సీఎం రాజన్నదొర ఇంటికి వెళ్లి వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై రాజన్నదొర మాట్లాడుతూ 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఒక్క గిరిజనుడుకి మంత్రి పదవి ఇవ్వకుండా, ఎస్టీ కమిషన్ ఏర్పాటుచేయకుండా, జీసీసీ, ట్రైకార్ చైర్మన్ నియామకాలు చేపట్టకుండా తీవ్రఅన్యాయం చేశారని గుర్తుచేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే బోయ, వాల్మీకి కులాలను ఎస్టీల్లో చేర్చుతూ అసెంబ్లీలో తీర్మానం చేశారని, గిరిజన హక్కులకు ఎటువంటి భంగం వాటిల్లనివ్వమని హామీ ఇవ్వకపోవడంతో నాడు ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతిను, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి గిరిజనులకు అన్యాయం చేయవద్దని విజ్ఞప్తి చేసినట్టు గుర్తుచేశారు. నిప్పు పెట్టడం, నిందలు వేయడం టీడీపీ నాయకులు నైజమని ఎద్దేవా చేశారు. జగనన్న పాలనలో గిరిజనులకు ఎటువంటి అన్యాయం జరుగదని పునరుద్ఘాటించారు. డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో ఆనంద్, జానకిరావు, నాగేశ్వరరావు, ప్రభాకర్, ఉదయ్, ఎస్.వై.నాయుడు ఉన్నారు.



డిప్యూటీసీఎం రాజన్నదొరను కలిసి వినతిపత్రాన్ని అందజేస్తున్న గిరిజన సంఘాల జేఏసీ నాయకులు

మాది గిరిజనుల పక్షపాత ప్రభుత్వం

చంద్రబాబు, లోకేష్ ఒత్తిడి చేస్తున్నారు. బోయ, వాల్మీకులను రెచ్చగొడుతున్నారు. వారి మాయలో పడొద్దు. ఒక గిరిజనుడిగా చెబుతున్నా.. మాది ఎప్పుడూ గిరిజనుల పక్షపాత ప్రభుత్వమే. గిరిజనులను తన కుటుంబంగా భావిస్తూ వారి సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో చేస్తున్నారు. టీడీపీ నాయకుల ఒత్తిళ్లే గాకుండా రాయలసీమ జిల్లాల్లో ఎక్కువగా ఉన్న బోయ, వాల్మీకులకు అక్కడ మాత్రమే ప్రయోజనం జరిగేలా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారు. జోనల్ విధానం వల్ల ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనుల ఉద్యోగ అవకాశాలపై ఏమాత్రం ప్రభావం ఉండదు. షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉన్న ఉద్యోగాలన్నీ అక్కడివారికే ఉంటాయి. ఏజెన్సీలోని గిరిజనుల కోసం అవసరమైతే చట్టాలు చేయడానికీ ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారు. ఏ సమస్యలున్నా చర్చిద్దామని భరోసా ఇచ్చారు.

– పీడిక రాజన్నదొర, ఎమ్మెల్యే, సాలూరు

విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు

- జిల్లా వ్యాప్తంగా రూ.4 కోట్ల విలువైన పరికరాల పంపిణీ
- అలిమ్ కో సంస్థ ఆధ్వర్యంలో అందజేత
- ఈ నెల 10 నుంచి ఏడు నియోజకవర్గాల్లో శిబిరాల నిర్వహణ
- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



చీపురుపల్లి: జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాల పంపిణీ కోసం చేసిన కృషి ఫలించిందని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన శనివారం మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో కేంద్ర ప్రభుత్వం చొరవతో జిల్లాలో విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు పంపిణీ జరగనుందన్నారు. భారత ప్రభుత్వ గుర్తింపు పొందిన అలిమ్ కో అనే కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం ఆధ్వర్యంలో రూ.4 కోట్ల విలువైన ఉపకరణాలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. విజయనగరం జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు పంపిణీ చేయాలని గత ఏడాది జూలై 25న మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్‌కు విన్నవించామని, ఆ మేరకు పంపిణీకి సూచనలు జారీ చేసినట్టు వెల్లడించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోనూ శిబిరాలఏర్పాటుకు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీచేశారన్నారు. మూడు చక్రాల సైకిళ్లు, వీల్‌చైర్లు, చంకకర్రలు, కృత్రిమ కాళ్లు, కాలిపర్స్, రోలేటర్స్, చెవి మిషన్లు, వాకింగ్ స్టిక్స్, మానసిక దివ్యాంగులకు ఎంఎస్ఐఈడీ కిట్లు, సీపీచైర్, బ్యాటరీ ఆపరేటెడ్ మూడు చక్రాల సైకిళ్లు వంటి పరికరాలు అందజేస్తారన్నారు. శిబిరాల్లో ఒక సంవత్సరం వయస్సు కలిగిన వినికిడి లోపం గల పిల్లలకు అవసరమైన పరీక్షలు నిర్వహించి సర్జరీ చేస్తామన్నారు. శిబిరాలకు వచ్చేవారు మెడికల్ బోర్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, రెండు పాస్ ఫొటోలు తీసుకుని రావాలన్నారు.

శిబిరాల నిర్వహణ ఇలా...

జిల్లాలో ఈ నెల 10 నుంచి 21వరకు జరిగే విభిన్న ప్రతిభావంతుల గుర్తింపు, ఉపకరణాల పంపిణీ శిబిరాలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు. ఈ నెల 10న ఎస్.కోట, 12న బొబ్బిలి, 13న రాజాం, 15న చీపురుపల్లి, 17న గజపతినగరం, 19న నెల్లిమర్ల, 21న విజయనగరం నియోజకవర్గాల్లో శిబిరాలు నిర్వహిస్తారన్నారు. అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వివాదాలు లేకుండా హద్దురాళ్ల ఏర్పాటు

పాలకొండ: వివాదాలకు తావులేకుండా భూ సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్ సర్వే సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని చింతాడ, గుడివాడ గ్రామాల్లో సరిహద్దుల ఏర్పాటును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ మ్యాప్ ఆధారంగా రైతుల సమక్షంలో హద్దురాళ్లు వేయాలన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తేవాలని సర్వేయర్ వెంకటరావుకు సూచించారు.

మీ చల్లని దీవెనలు ఉంటే చాలు...

- ఆసరా సభలో మంత్రి బొత్స సత్యనారాయణ



ఎస్.కోట సభలో మహిళలనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

శృంగవరపుకోట: మహిళలు, పేదల ఆర్థికోన్నతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారు.. సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారు.. మీ చల్లని దీవెనలు.. మీ అభిమానం ఉన్నంత కాలం ఆయనే ముఖ్యమంత్రిగా ఉంటారు.. పేదలకు మరింత మేలుచేస్తారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఎస్.కోట ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన వైఎస్సార్‌ఆసరా 3వ విడత నిధుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆసరా నిధులు సోమవారం నాటికి మహిళల ఖాతాల్లో జమవుతాయని జగన్ అన్న మాటగా చెప్పడానికే మేమంతా ఇక్కడి కొచ్చామన్నారు. మాటకు కట్టుబడిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. నాలుగేళ్ల పాలన తర్వాత ధైర్యంగా వేలాది మంది మధ్య పథకాలు అందాయా అని ధైర్యంగా అడుగుతున్నామంటే పారదర్శకపాలనే కారణమన్నారు. చంద్రబాబు నాయుడు పాలనలో పింఛన్ కావాలన్నా, ఇల్లు కావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగేవారని, ఇప్పుడు అర్హత ఉంటే చాలన్నారు. మహిళలు, వారి కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే జగన్ ఆలోచన అని, వాటికి తగ్గట్టుగానే పాలన సాగుతోందన్నారు. పచ్చపత్రికల అడ్డగోలు ప్రచారాలకు భయపడేదిలేదన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి జగన్‌తోనే సాధ్యమని పేర్కొన్నారు. సభలో పలువురు మహిళలకు మైక్‌ఇచ్చి వాళ్లు లబ్ధిపొందిన పథకాలు, అమలును అడిగి తెలుసుకున్నారు.

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకం కింద 25 వేల కోట్లు రుణ మాఫీ చేశారని, నాలుగేళ్ల పాలనలో ఆసరా, చేయూత పథకాలతో పాటు అమ్మఒడి, వసతి దీవెన, విద్యాదీవెన, రైతుభరోసా.. ఇలా ఒక్కో కుటుంబానికి సరాసరి లక్ష నుంచి రూ.9 లక్షలమేర లబ్ధి చేకూరిందన్నారు. పిల్లల చదువుతోనే పేదకుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని నమ్ముతూ విద్యారంగానికి సీఎం అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఆయన నాయకత్వం కొనసాగించాల్సిన అవసరం మనందరిపైనా ఉందని తెలిపారు.
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు రుణమాఫీ చేస్తానని చెప్పి మోసం చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం 78 లక్షల మంది మహిళల డ్వాక్రా రుణాలు రూ.25వేల కోట్లను నాలుగు దఫాలుగా మాఫీ చేస్తానని చెప్పారని, ఇప్పటికే మూడు విడతల నిధులు విడుదల చేసినట్టు వెల్లడించారు. ఎస్.కోటలో అభివృద్ధి జరిగిందంటే అది నాడు రాజన్న, నేడు జగనన్న పాలనలోనేనని స్పష్టంచేశారు. జలజీవన్‌మిషన్ కింద ఎస్.కోట మండలంలో ప్రతిఇంటికీ తాగునీరు సరఫరా చేస్తామని చెప్పారు.
- ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకం అక్కచెల్లెమ్మలకు వరమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు అక్కచెల్లెమ్మల ఆశీస్సులు ఉండాలన్నారు.
- కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ఎదగడానికి అవసరమైన తోడ్పాటును, ఆర్థిక సహకారాన్ని ప్రభుత్వం అందిస్తోందని, మహిళలు అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. అనంతరం మంత్రి బొత్స, ఎమ్మెల్యే కడుబండి, ఎమ్మెల్సీ రఘురాజు తదితరులు వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద కళ్లద్దాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. రూ.7.83 కోట్లు ఆసరా చెక్కును మహిళా సంఘాల ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శోభాహైమావతి, జీసీసీ చైర్‌పర్సన్ శోభాస్వాతిరాణి, డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణచక్రవర్తి, మండల ప్రత్యేక అధికారి సుదర్శనదొర, ఏరియా కోఆర్డినేటర్ జయశ్రీ, ఎంపీడివో శేషుబాబు, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ ఎం.కస్తూరి, వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆర్.జగన్నాథం, ఎంపీపీలు ఎస్.సోమేశ్వరరావు, డి.సత్యవంతుడు, ఎన్.గోపమ్మ, జెడ్పీటీసీలు ఎం.వెంకటలక్ష్మి, టి.వరలక్ష్మి, జి.సరయు, జి.శివ తదితరులు పాల్గొన్నారు.



ఎస్.కోటలో ఆసరా సంబరాలకు హాజరైన మహిళలు

క్లుప్తంగా

హడలెత్తిస్తున్న గజరాజులు



పక్కుడుబద్ర జీడి తోటల్లో సంచరిస్తున్న గజరాజులు

భామిని: మండలంలోని పక్కుడుబద్ర జీడి తోటల్లో మకాం వేసిన గజరాజుల గుంపు శనివారం హడలెత్తించాయి. సమీపంలోని నీలంతేశ్వరాలయం సమీపంలోకి ప్రవేశించిన ఏనుగులను చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావడంతో పరుగులు పెట్టించాయి. జీడి తోటలను ధ్వంసం చేశాయి. మరో వైపు రబీ పంటలను తీవ్రంగా నష్టపరుస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్యా యత్నం



చికిత్స పొందుతున్న వరలక్ష్మి

పార్వతీపురం: భార్యాభర్తల మధ్య నెలకొన్న చిన్నపాటి వివాదం వివాహిత ఆత్మహత్యా యత్నానికి దారి తీసింది. పార్వతీపురం అవుట్ పోస్టు పోలీసులు శనివారం తెలిపిన వివరాలు.. బలిజిపేట మండలం వెంగాపురం గ్రామానికి చెందిన వై.వరలక్ష్మి ఇంట్లో ఉన్న లైజాల్ తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. భార్యాభర్తల మధ్య గొడవ తరువాత భర్త ప్రసాద్ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోవడంతో భార్య లైజాల్ తాగింది. స్థానికులు గమనించి బలిజిపేట పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స తరువాత మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రాల తనిఖీ

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లాలో 127 పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో శనివారం జరిగిన ఇంగ్లిష్ పరీక్ష సజావుగా జరిగింది. రెగ్యులర్ విద్యార్థులు 24,064 మందికిగాను 24,004 మంది హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులు 25 మందికిగాను 15 మంది హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 99.75 శాతం హాజరు కాగా, ప్రైవేటు విద్యార్థులు 60 శాతం హాజరైనట్టు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాలను సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహారాజ సాంస్కృతిక హైస్కూల్, పీఎస్ఆర్ స్కూల్, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. డీఈఓ ఆరు పరీక్ష కేంద్రాలను, కలెక్టర్ రెండు పరీక్ష కేంద్రాలను, స్క్వాడ్ బృందాలు 69 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

ఐసీడీఎస్ సూపరింటెండెంట్‌గా పూర్ణచంద్రుడు

పార్వతీపురం: జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్‌గా డి.పూర్ణచంద్రుడు శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఈ మేరకు ఐసీడీఎస్ పీడీ కె.విజయగౌరిని కలిసి అభినందనలు తెలిపారు. సిబ్బందితో సమన్వయం చేసుకొని బాధ్యతలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

పాము కాటుకు గురైన మహిళ మృతి



నారితల్లమ్మ (ఫైల్)

జామి: మండల కేంద్రానికి చెందిన గట్రెడ్డి నారి తల్లమ్మ(35) తన పొలంలో శుక్రవారం మధ్యాహ్నం వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటుకు గురైంది. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతురాలికి భర్త ముత్యాలునాయుడు, కుమారుడు, కుమార్తె ఉన్నారు. జామి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	56,150-00
బంగారం(22కి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹100	₹170	₹ 180

పీహెచ్‌సీల్లో వైద్య సేవలు భేష్

- ఈ చిత్రంలో మహిళకు ప్రసవం చేసిన వైద్య సిబ్బంది రేగిడి ఆమదాలవలస పీహెచ్‌సీకి చెందినవారు. మార్చి 19వ తేదీన రేగిడి ఆమదాలవలస మండలం తునివాడకు చెందిన లక్ష్మి అనే గర్భిణి ప్రసవం కోసం పీహెచ్‌సీలో చేరింది. వైద్య సిబ్బంది ఆమెకు 19వ తేదీ అర్ధరాత్రి 1.18 నిమిషాలకు ప్రసవం జరిపించారు. ఆమెకు మగ బిడ్డ జన్మించాడు.
- బొబ్బిలి మండలం పిరిడి పీహెచ్‌సీలో కూడా ప్రసవం కోసం చేరిన ఓ మహిళకు రాత్రి 10 గంటల సమయంలో అక్కడ వైద్య సిబ్బంది ప్రసవం జరిపించారు. ఆమెకు ఆడపిల్ల జన్మించింది. ఈ ఇద్దరికే కాదు. అనేక మంది గర్భిణులకు, రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారికి 24 గంటల పాటు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సేవలు అందిస్తున్నారు.



రేగిడి ఆమదాలవలస పీహెచ్‌సీలో ప్రసవించిన మహిళతో వైద్య సిబ్బంది

- 24 గంటలూ అందుబాటులో సేవలు
- జిల్లాలో 48 పీహెచ్‌సీలు
- రాత్రి వేళల్లో గర్భిణులకు ప్రసవాలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: గ్రామీణ ప్రాంత ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు సకాలంలో అందించాలనే ఉద్దేశంతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పీహెచ్‌సీలన్నింటిని 24 గంటల పీహెచ్‌సీలుగా మార్చేసింది. దీని వల్ల పీహెచ్‌సీల్లో 24 గంటలూ రోగులకు వైద్య సేవలు అందుతున్నాయి. 24 గంటల పీహెచ్‌సీలు కాక ముందు సాయంత్రం ఐదు గంటలకే ఇవి గత ప్రభుత్వంలో మూతపడేవి. ఐదు గంటల తరువాత పీహెచ్‌సీకి వచ్చేవారు దూర ప్రాంతంలో ఉన్న సీహెచ్‌సీకిగాని, జిల్లా ఆస్పత్రికిగాని వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఈ సమయంలో రోగి పరిస్థితి విషమిస్తే మృత్యువాత పడేవారు. 24 గంటల పాటు ప్రస్తుతం పీహెచ్‌సీల్లో వైద్య సేవలు అందడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి సైతం సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయి. తరువాత అవసరాన్ని బట్టి రిఫరల్ ఆస్పత్రికి తరలిస్తున్నారు. దీని వల్ల ప్రాణాపాయ పరిస్థితి తప్పుతుంది. రోగుల్లో భయాందోళనలు తొలగి ఆత్మస్థైర్యం కలుగుతుంది.

రాత్రి వేళల్లో సేవలు

పీహెచ్‌సీల్లో సాధారణంగా జ్వరం, జలుబు, దగ్గు, గాయపడ్డ వారు, గర్భిణులకు వైద్య పరీక్షలు వంటి సేవలు అందేవి. 24 గంటలూ పీహెచ్‌సీలు అయిన తరువాత వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. గతంలో ప్రసవాలు సీహెచ్‌సీ, ప్రాంతీయ ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రుల్లో చేసేవారు. ఇప్పుడు పీహెచ్‌సీల్లో సైతం ఈ సేవలు అందుతున్నాయి. ముఖ్యంగా అర్ధరాత్రి వేళ కూడా గర్భిణులకు పీహెచ్‌సీల్లో ప్రసవాలు జరిపిస్తున్నారు. ఫలితంగానే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగింది. గర్భిణులు కూడా ఇక్కడ ప్రసవమయ్యేందుకు ఇష్టపడుతున్నారు. అంతేకాకుండా రాత్రి వేళ రోడ్డు ప్రమాదాలు, పాము కాటు బాధితులు వంటి వైద్య సేవలు కోసం వచ్చే వారికి చికిత్స అందిస్తున్నారు.

24 గంటలూ వైద్యం



జిల్లాలో పీహెచ్‌సీల్లో 24 గంటలూ వైద్య సేవలు అందుతున్నాయి. ప్రసవాలు కూడా జరుగుతున్నాయి. కొందరు వైద్యులు ప్రసవాలపై శిక్షణ కావాలని అడిగారు. అందుకోసం వైద్యులకు సీహెచ్‌సీల్లో శిక్షణ కూడా ఇవ్వనున్నాం.

– డాక్టర్ ఎస్‌వీ రమణకుమారి, డీఎంహెచ్‌ఓ

రూ.52.90 లక్షల అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని శాసన సభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని పలు డివిజన్లలో రూ.52.90 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను శనివారం ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు అనుగుణంగా నగరంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. వార్డుల్లో ఉన్న సమస్యలను స్థానిక నాయకులు గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. నగరాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, 22వ డివిజన్ కార్పొరేటర్ భవిరెడ్డి సతీష్, జోనల్ ఇన్‌చార్జి బోడసింగి ఈశ్వరరావు, నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామేశ్వరపు రామారావు, కేదారిశెట్టి వెంకన్నబాబు, డివిజన్ అధ్యక్షుడు ఊడి సంతోష్, మాజీ కౌన్సిలర్ జాడె తులసీరావు, ఆకుల శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేత రాజమండ్రి



హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

సంతకవిటి : జావాంలో పగడాలమ్మ ఆలయ జాతర సందర్భంగా నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నీ శనివారంతో ముగిసింది. రెండు రోజుల పాటు హోరాహోరీగా ఈ పోటీలు జరిగాయి. మొత్తం 23 టీంలు ఈ పోటీల్లో పాల్గొనగా, ప్రథమ స్థానాన్ని రాజమండ్రి, ద్వితీయ స్థానంలో జావాం, తృతీయ స్థానంలో సంతకవిటి టీంలు నిలవగా, నాల్గవ స్థానంలో వీరఘట్టం టీం నిలిచింది. విజేతలకు నిర్వాహకులు ప్రైజ్ మనీని జావాం సర్పంచ్ బోనెల ప్రసాద్, మాజీ సర్పంచ్ కర్నాయిన రామకృష్ణంనాయుడు, జాతర కమిటీ పెద్దలు అందజేశారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ప్రభుత్వ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు మీసాల కూర్మినాయుడు, పి.వెంకటనాయుడు, వై.తవిటినాయుడు, కె.బుజ్జి, ఆర్.రాములు, ఎం.రామకృష్ణ, ఎస్‌వీరమణ, ఎస్.రాంబాబు, ఎమ్ఆర్‌కే నాయుడు, రామచంద్ర, రవి, కె.సన్నిబాబు వ్యవహరించారు.

సీతంలో ముగిసిన 'హ్యాకథాన్' టెక్నో పోటీలు



ముగింపు సభలో పాల్గొన్న ఏపీ స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ డాక్టర్ కేసలి అప్పారావు

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగు రోజులుగా నిర్వహించిన 'హ్యాకథాన్–2023' శనివారం ముగిసింది. బ్రెయిన్ ఓ విజన్ సంయుక్త నిర్వహణలో శిక్షణ మరియు స్మార్ట్ విజయనగరం అంశంగా జరిగిన కార్యక్రమంలో దాదాపు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు బృందాలుగా ఏర్పడి ఒక్కొక్క బృందం వారీగా పోటీపడ్డారు. ఒక్కో బృందం విజయనగరంలో ఒక వ్యాపారాన్ని ఎంచుకుంది. దాని కోసం ఒక ఇంటరాక్టివ్ వెబ్‌సైట్‌ను రూపొందించాయి. ఈ అభ్యాసం వారికి వెబ్ డెవలప్‌మెంట్ యొక్క ఎండ్ టు ఎండ్ అనుభవం సంగ్రహావలోకనం ఇచ్చింది. బ్రెయిన్ ఓ విజన్ బృందం మరియు ఈ సంస్థ సీఈఓ గణేష్ నాగ్ నేతృత్వంలో వెబ్ డెవలప్‌మెంట్‌లో విద్యార్థులకు తక్కువ కోడ్/నో–కోడ్ పద్ధతుల్లో శిక్షణ ఇచ్చారు. బ్రెయిన్ ఓ విజన్ ఎగ్జిక్యూటివ్స్ ద్వారా గత రెండు రోజుల పాటు శిక్షణ కొనసాగింది. విద్యార్థులు తాము అభివృద్ధి చేసిన ప్రాజెక్ట్‌ను పూర్తి చేయడంలో భాగంగా శుక్రవారం రోజంతా కళాశాలలో ఉండి పూర్తి చేశారు. కోడింగ్ కార్యక్రమంతో పాటు విద్యార్థులకు టగ్ ఆఫ్ వార్, క్యాంప్ ఫైర్, డ్యాన్స్‌లు, టంగ్ ట్విస్టర్, డైలాగ్ డెలివరీ మరియు ఇతర ఒత్తిడిని తగ్గించే కార్యకలాపాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పోటీల విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ డాక్టర్ కేసలి అప్పారావు, బోధి మాట్లాడుతూ శాశ్వత అనుభవం విద్యార్థులకు నిజ జీవితంలో డెడ్‌లైన్‌ల రుచిని అందించిందన్నారు. కళాశాల సెక్రటరీ, మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బోధి జాడే లిమిటెడ్ కెనడా నుంచి హుయిజాంగ్ యాంగ్, సీనియర్ డైరెక్టర్, పాల్యూషన్స్ ఆర్కిటెక్చర్, క్రోగర్ టెక్నాలజీ, క్రోగర్ ఇంక్, సిన్సినాటి అమెరికా నుంచి శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, ప్రోగ్రామ్ కన్వీనర్ సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ జి.వేణుమాధవరావు, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దళితులు, ముస్లింలపై దాడులు తగవు

విజయనగరం ఫూల్‌బాగ్: దేశంలో మోదీ నేతృత్వంలో దళితులు, ముస్లింలపై జరుగుతున్న హత్యలు, పైశాచిక దాడులను ఐక్యంగా ప్రతిఘటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సీపీఐ, డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జిల్లా సీపీఐ కార్యదర్శి ఒమ్మి రమణ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన జి. ఈశ్వరయ్య, జేవీ ప్రభాకర్ మాట్లాడుతూ మూడున్నరేళ్లలో దళితుల, ముస్లింలపై హత్యలు, పైశాచికంగా దాడులు జరుగుతుంటే కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకుండా రాజకీయ పదవులు, అధికార పదోన్నతులు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ నెల 11న తలపెట్టిన చలో విజయవాడకు దళిత సంఘాలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సురగడ రమేష్‌కుమార్, ముస్లిం జమాత్ కమిటీ నాయకులు రహమాతుల్ల, కరీం భాయ్, ఆప్ నియోజకవర్గ కన్వీనర్ టి.కోటేశ్వరరావు, లోక్‌సత్తా పార్టీ నాయకులు రాజారావు, సీపీఐ సహాయ కార్యదర్శులు బుగత అశోక్, అలమండ ఆనందరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రంగరాజు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గోకా రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మధుసూదనరావు(ఫైల్)

సీతానగరం: మండలంలోని రెడ్డివానివలస గ్రామానికి చెందిన రెడ్డి మహేశ్వరరావు(మధుసూదనరావు) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ కె.నీలకంఠం తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ శనివారం తెలిపిన వివరాలు... గత నెల 30న 36వ నంబరు రాష్ట్ర రహదారిలో పణుకుపేట జంక్షన్ వద్ద పార్వతీపురం వైపు నుండి బొబ్బిలి వెళ్తున్న మోటారుసైకిలిస్ట్ ఢీకొన్న ప్రమాదంలో మధుసూధనరావు గాయాల పాలయ్యాడు. గాయాల పాలైన మధుసూదనరావును కుటుంబీకులు పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడి ఔట్ పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి సీతానగరం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స చేస్తుండగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం విజయనగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు చికిత్స నిమిత్తం రిఫర్ చేశారన్నారు. అక్కడ చికిత్స పొందుతుండగా శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు శనివారం సమాచారం వచ్చిందన్నారు. కేజీహెచ్‌లో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించినట్లు తెలిపారు.

రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన



రక్తదాన శిబిరంలో పాల్గొన్న దాతలు

విజయనగరం: జిల్లా హోటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. నగరంలోని కొత్త అగ్రహారం రోటరీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఈ శిబిరాన్ని హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మారుతి శ్రీనివాస్, కార్యదర్శి నవీన్, మయూర హోటల్ అధినేత వై.బాబురావు ప్రారంభించారు. ఆరోగ్యవంతులు ప్రతీ మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావన్నారు. అపోహలు విడిచిపెట్టి యువత రక్తదానం చేసేందుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 55 మంది రక్తదానం చేశారు.

ఘనంగా రన్ ఫర్ జీసెస్



కేఎల్‌పురం మన్నా చర్చి వద్ద శాంతి ర్యాలీలో పాల్గొన్న క్రీస్తు ఆరాధకులు



రన్ ఫర్ జీసెస్ ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐసీసీ ప్రతినిధులు

విజయనగరం టౌన్: మరణాన్ని జయించిన జయశీలుడు ఏసుక్రీస్తు అని సిమ్స్ బాప్టిస్ట్ చర్చి సంఘమిత్ర ఆర్ఎస్ జాన్ అన్నారు. గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పర్వదినాలను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో శనివారం 'రన్ ఫర్ జీసెస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక సిమ్స్ చర్చి నుంచి కన్యకపరమేశ్వరీ ఆలయం, గంటస్తంభం, కోట తదితర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఏసు సువార్తను ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో బిషప్ కేజే ఫిలోమాన్, టి.ఆనంద్, ఎస్.జీవన్, సునీల్, కరుణ, కృపా, లూక్, తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీసీ ఆధ్వర్యంలో..

ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐసీసీ) ఆధ్వర్యంలో 'రన్ ఫర్ జీసెస్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఏఐసీసీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పి.ప్రేమానందం ఆధ్వర్యంలో జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ బిషప్ ఎం.పాల్సన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 47వ వార్డు కార్పొరేటర్ పట్నాన పైడిరాజు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి కంటోన్మెంట్, కలెక్టరేట్, మీదుగా మన్నా చర్చ్ వరకు ర్యాలీ కొనసాగింది. పాస్టర్లు కె.పిలిఫ్, వివేక్, వి.సత్యరాజ్, ఎలీషా, రఘు, చిట్టిబాబు, ఎల్.మధు. జి.శ్రీధర్ పాల్గొన్నారు.

మద్యం కేసులో ఇద్దరి అరెస్టు

రాజాం సిటీ: మండలంలోని పెనుబాక, ఆగూరు గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని శనివారం అరెస్టు చేసినట్లు సీఐ కె.రవికుమార్ తెలిపారు. మద్యం విక్రయాలపై ముందస్తు సమాచారం మేరకు తనిఖీలు చేయగా.. ఇద్దరు వ్యక్తుల వద్ద 50 మద్యం సీసాలు గుర్తించినట్లు చెప్పారు. వాటిని స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు.

పక్కాగా భూముల రీసర్వే



కందివలసలో హద్దురాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న ఆర్‌డీఓ హేమలత

కొమరాడ: పక్కాగా భూముల రీసర్వే చేపట్టి, రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాలు పరిష్కారమయ్యేలా చూడాలని పార్వతీపురం ఆర్‌డీఓ కె.హేమలత సూచించారు. శనివారం మండలంలోని కుమ్మరిగుంట పంచాయతీ, కందివలస గ్రామంలో భూముల రీసర్వేలో భాగంగా చేస్తున్న హద్దురాళ్ల ఏర్పాటును పరిశీలించిన ఆమె మే 15 నాటికి సర్వే పూర్తి చేయాలని తెలిపారు. రైతుల సమక్షంలోనే సర్వే, హద్దురాళ్ల ఏర్పాటు జరగాలన్నారు. సర్వే అధికారులకు రైతులు కూడా సహకరించాలని కోరారు. ఆమె వెంట తహసీల్దార్ రాధాకృష్ణ, మండల సర్వేయర్ స్వామినాయుడు ఉన్నారు.